క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఘనంగా సీతారామాంజనేయ తీర్థమహోత్సవం



సబ్బవరం: మండలంలోని నారపాడు శివారు అమ్ములపాలెంలో సీతారామాంజనేయస్వామి తీర్థమహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రామ పెద్దలు గొర్లి నూకరాజు, తాసుబిల్లి కనకరాజు, సంగ్రాన సురేష్, ఆకుల కుమార్ తదితరులు స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు.

జువ్వమాంబ ఆలయ వార్షికోత్సవం రేపు



పరవాడ: కన్నూరు శివారు మడకపాలెంలో కొలువైన జువ్వమాంబ అమ్మవారి ఆలయ మూడవ వార్షికోత్సవాన్ని ఈ నెల 21న ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. వార్షికోత్సవంలో భాగంగా ఆ రోజు వేకువ జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నారు. గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చి అమ్మవారి పూజల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

శివాలయ నిర్మాణానికి విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న మండల రాము

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని శివాలయ పునర్నిర్మాణానికి మాజీ సర్పంచ్ మండల సోమునాయుడి కుమారుడు రాము బుధవారం రూ.50,116 విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని నిర్మాణంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నాగేశ్వరరావు, ప్రకాష్, బర్ల రమణ, బాదిరెడ్డి లక్ష్మణ, కొల్లి కృష్ణ, కనకరాజు, గెద్దం కృష్ణ, కోరాడ శ్రీను, చింతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో జర్నలిస్టుల క్రికెట్ పోటీలు

పరవాడ: రాంకీ ఫౌండేషన్ సహకారంతో విశాఖ, అనకాపలి జిల్లాల జర్నలిస్టులకు ఈ నెల 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు ఆహ్వానపు క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ క్రికెట్ పోటీలు ఫార్మాసిటీ క్రీడా మైదానంలో జరుగుతాయన్నారు. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. పోటీల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి ఏడు జట్లు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఫార్మాసిటీ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ ఈ పోటీలను గురువారం ప్రారంభిస్తారని తెలిపారు. విజేతలకు రాంకీ పౌండేషన్ సహకారంతో బహుమతులు అందజేయనున్నట్లు ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్ వెల్లడించారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఆరుగురికి కోర్టు రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.60 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. బుధవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నీటి ఎద్దడికి సూక్ష్మ సేద్యంతో చెక్

సబ్బవరం మండలం ప్రధానంగా వర్షాధారం. నీటి ఎద్దడి అధికంగా ఉండటంతో సూక్ష్మ సేద్యం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ విధానంలో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయొచ్చు. అందుకే మండలంలోని 992 మంది రైతులు 2,209 ఎకరాల్లో సాగుకు బిందు, తుంపర్ల విధానాన్నే ఆశ్రయించారు. గత ప్రభుత్వంలో దీన్ని ఎక్కువగా ప్రోత్సహించినా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సాగు లక్ష్యాన్ని తగ్గించే దిశగా ఆలోచన చేస్తుండటం గమనార్హం.



దేవీపురం సమీపంలో తుంపర్ల సేద్యం ద్వారా సరుగుడు మొక్కల సాగు

బిందు సేద్యం యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బిందు సేద్యంలో ఎరువులు అందించే ఏర్పాటు చేసిన బెంచూరి, హెడ్ కంట్రోల్ యూనిట్

సబ్బవరం:

సబ్బవరం మండలంలో రైతుల ఆసక్తి
బిందు, తుంపర్ల సేద్యంలో 992 మంది
సాగు విస్తీర్ణం 2,209 ఎకరాలు

తుంపర్ల సేద్యం రాయితీ
తుంపర్ల సేద్యం(స్ప్రింక్లర్ ఇరిగేషన్) కోసం 5 ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతులకు 55 శాతం, 5 ఎకరాలు పైబడిన రైతులకు 45 శాతం రాయితీ అందిస్తారు.

బిందు సేద్యం రాయితీ
బిందు సేద్యం(డ్రిప్ ఇరిగేషన్) కోసం 5 ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతులకు 90 శాతం, 5 నుంచి 12.5 ఎకరాలున్న రైతులకు 50 శాతం రాయితీ అందిస్తున్నారు.

సాగు నీటి వనరులు తగ్గుతుండటంతో పాటు భూగర్భ జలవనరులు నానాటికీ అడుగంటడంతో సేద్యానికి సాగునీటి సమస్య తలెత్తుతోంది. దీంతో రైతులు పంటలు వేసుకున్నప్పటికీ ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించలేకపోతున్నారు. ఉన్న కొద్దిపాటి సాగు నీటి వనరులు వృథా కావడంతో పరిమిత విస్తీర్ణంలో పంటలను సాగు చేయాల్సి వస్తోంది. అయితే తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో భూమిని సాగుచేసేందుకు సూక్ష్మ సేద్యం ఎంతో ఉపయోగపడుతోంది.

సాగు నీరు ఆదా

సూక్ష్మ నీటి సేద్యంలో సాగునీరు చాలా వరకు ఆదా అవుతుంది. సాంప్రదాయ సాగునీటి సేద్యం కంటే తక్కువ నీటిని వినియోగించి పంటలను పండించవచ్చు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా రైతుల్ని ప్రోత్సహిస్తోంది. ప్రధానంగా బిందు సేద్యం ద్వారా సాగు చేసే రైతులకు 40 నుంచి 50 శాతం వరకూ నీరు ఆదా అవుతుంది. తుంపర్ల సేద్యంలో 30 నుంచి 40 శాతం సాగు నీరు ఆదా. దీంతో నీటి ఎద్దడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో రైతులు వీటి వైపు మొగ్గు చూపేలా గత ప్రభుత్వం ఎక్కువగా ప్రోత్సహించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మాత్రం సూక్ష్మ సేద్యాన్ని పెద్దగా పట్టించుకోవట్లేదన్న ఆక్షేపణలు వినిపిస్తున్నాయి.

జిల్లా లక్ష్యం 3,600 హెక్టార్లు

రైతులు సాగు వ్యయం తగ్గి పంట నాణ్యత, దిగుబడి పెంచుకునేందుకు సూక్ష్మ సేద్యం మేలైన మార్గం. దీంతో అనకాపల్లి జిల్లాకు 2024–25 సంవత్సరాలకు 3,600 హెక్టార్లు సాగులోకి తీసుకురావాలని లక్ష్య నిర్దేశం చేశారు. ఇందుకు 60–40 నిష్పత్తిలో రూ.9.72 కోట్లు కేంద్రం, రూ.6.48 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించేలా మొత్తం రూ.16.20 కోట్ల ఆర్థిక ప్రణాళికతో లక్ష్య నిర్దేశం చేశారు. సూక్ష్మ సేద్యం అమలుకు నీటి వసతి, విద్యుత్ కనెక్షన్ లభ్యత తప్పనిసరి.

యూనిట్లు పొందడమిలా..

బిందు/ తుంపర్ల సేద్యం యూనిట్ల కోసం మొదటిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతులకు ప్రాధాన్యత ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారు. రైతు ఎంచుకొన్న కంపెనీ ద్వారా రైతు వాటాను తెలియజేస్తారు. రైతు వాటాను జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి అకౌంట్‌కు చెల్లించాక, జిల్లా కలెక్టర్ అనుమతితో బిందు, తుంపర్ల సేద్యం పరిపాలన అనుమతులు, యూనిట్లు మంజూరు చేస్తారు.

రాయితీపై పరికరాలు అందించే కంపెనీలు

- ఫిన్‌లెక్స్ ప్లాసన్ ఇండస్ట్రీస్ ప్రై.లి.
- సిగ్నేట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్
- కొఠారి అగ్రిటెక్ ప్రై.లి.
- నెటాఫిమ్ ఇరిగేషన్ ఇండియా ప్రై.లి.
- సుధాకర్ పీవీసీ ప్రొడక్ట్స్ లిమిటెడ్
- డ్రిప్ ఇండియా ఇరిగేషన్ ప్రై.లి.
- జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

బిందు పద్ధతిలోనే సాగు



ఉద్యాన పంటలైన బొప్పాయి, కాలీఫ్లవర్, టమాటా, ఉల్లి, అరటి వంటి పంటలను 7 ఎకరాల వరకూ సాగు చేస్తున్నా. ఇందులో కొంత సొంత భూమి కాగా, మిగిలిన భూమిని రైతుల నుంచి కౌలుకు తీసుకున్నా. అధిక శాతం పంటలన్నీ బిందు సేద్యంలోనే సాగు చేస్తున్నా. ప్రభుత్వం రాయితీపై పైపుల్ని అందించింది.

– చీపురుబల్లి బంగారరాజు, అమృతపురం

ఖర్చు తగ్గి.. నీటి ఆదా



సూక్ష్మ సేద్యంలో మొక్కకు అవసరమైన మేరకు మాత్రమే నీరు పడుతుంది. దీంతో అధిక శాతం సాగునీరు ఆదా అవుతుంది. కలుపు నివారణ కావడంతో కూలీల ఖర్చు తగ్గుతుంది. డ్రిప్ ద్వారా పంటలకు కావలసిన ఎరువులను కూడా అందించవచ్చు. దీంతో ఎరువులు వేసే ఖర్చు తగ్గడంతో పాటు, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు.

– ఎస్.సతీష్, మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారి, సబ్బవరం

సింహగిరిపై శ్రీనృసింహ హోమం



హోమం జరుపుతున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం విశేషంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లని కొలువుంచారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచన, షోడశోపచారపూజలు జరిపారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద వేంజేపచేశారు. మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా చేశారు. కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న అయిత సింహాచలం, భక్తులు

పెందుర్తి: పులగానిపాలెంలో కొలువుదీరిన వేణుగోపాలస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. గరిడీలు, కోలాటాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. స్వామివారి ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో మాజీ సర్పంచ్ అయిత సింహచలం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిపారు. దాదాపు 4 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కమిటీ ప్రతినిధులు కాగిత రమణ, కన్నారావు, గొంప రాజు, కాగిత అప్పలరాజు, సబ్బవరపు రామునాయుడు, ఆర్.ఎస్.నాయుడు, గౌరి, నూకరాజు, వేలాదిగా భక్తులు వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు.

నేడు స్వయంభూవరం దుర్గమాంబ పండగ



స్వయంభూవరంలో వెలసిన దుర్గమాంబ అమ్మవారు

పరవాడ: కలపాక శివారు స్వయంభూవరంలో కొలువైన దుర్గమాంబ పండగను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఆలయాన్ని విద్యుత్ తోరణాలతో అలంకరించారు. పురవీధులను విద్యుత్ లైటింగ్‌తో సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు గురువారం ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకుంటారు. రాత్రికి డప్పులు, చిడతలు, తప్పెటగుళ్లు, కర్ర సాము, నేల డ్యాన్సులతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగిస్తారు. పండగ మహోత్సవంలో భాగంగా రాత్రికి సామ్రాట్ అశోక్ సాంఘిక నాటకాన్ని ప్రదర్శించనున్నారు. అనంతరం భాజాభజంత్రీలు, భారీ బాణసంచా వెలుగుల మధ్య అమ్మవారి అనుపు మహోత్సావాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది.

వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ



ఛత్రపతి శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ శంకర్

సబ్బవరం: వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ కొనియాడారు. సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివాజీ శక్తియుక్తులు, ధీరత్వం నేటి యువతకు ఆదర్శమన్నారు. సాంప్రదాయాల పరిరక్షణకు మొగల్ చక్రవర్తులతో అలుపెరగని పోరాటం చేసిన వీరుడని కొనియాడారు. ఆయన కఠోర శ్రమ, ఆత్మవిశ్వాసం విద్యార్థులకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వీవీ గోపాలకృష్ణ, ఎంవీ రామకృష్ణ, డాక్టర్ లెక్కల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ



సరోజిని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ నాయకులు

పరవాడ: రావాడ శివారు సోమునాయుడుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సిరపరపు అక్కులు సతీమణి సరోజిని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం నిర్వహించిన వర్థంతి కార్యక్రమంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొని ఆ కుటుంబాన్ని పరామర్శించారు. సరోజిని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదీప్‌రాజ్‌తో పాటు రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ, పెందుర్తి మండల వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, సిరికి దేముడు, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ కార్యదర్శి పల్లా గోవిందు, పార్టీ నాయకుడు నందవరపు శ్రీనివాసరావు, వర్రి హరి, సిరపరపు చంటి, శ్రీను, అప్పారావు, శేషు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కలిగిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు

పెందుర్తి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని పెందుర్తి ట్రాఫిక్ విభాగం ఎస్ఐ నరసింగరాజు సూచించారు. వేపగుంట కూడలి వద్ద బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు, ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. హెల్మెట్, కారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరం అని కోరారు.

సకాలంలో మెరుగైన వైద్య సేవలందించండి

- హెల్త్ క్లినిక్ సిబ్బందితో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం



కన్నూరు హెల్త్ క్లినిక్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం

పరవాడ: గర్భిణులకు సకాలంలో, మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సూచించింది. కన్నూరు గ్రామంలో హెల్త్ క్లినిక్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రతినిధులు బుధవారం సందర్శించారు. సెంటర్‌లో వైద్య సేవలు అందుతున్న విధానాన్ని పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను సకాలంలో అందించి, వారి మన్ననలు పొందాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రిలోనే సురక్షిత కాన్పులు జరిగేలా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. మాతా శిశు మరణాలకు తావులేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి యాప్‌లో అప్‌లోడ్ చేసి, సీజనల్ వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీవో జగదీష్, స్టాటిస్టికల్ ఆఫీసర్ రామచంద్రరావు, కోఆర్డినేటర్ జనార్దన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్ఎస్ సాయిరాం, పీహెచ్ఎన్ జానకి రామన్, యూడీసీ ఆనంద్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

సబ్బవరం: ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్, అనుబంధ సంఘాల అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మను గెలిపించాల్సిందిగా ఆయన మద్దతుదారులు మండలంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్ ఆధ్వర్యంలో ఆరిపాక, నంగినారపాడు, రావలమ్మపాలెం, తవ్వవానిపాలెం, మల్లునాయుడుపాలెం జెడ్పీ హైస్కూళ్లు, సబ్బవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల, కేజీబీవీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు పలు ప్రైవేట్ స్కూళ్ల ఉపాధ్యాయులను కలిసి, రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఏపీటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి లెక్కల హేమంత్, ప్రతినిధులు యడ్ల దత్తాత్రేయ, వి.కోటేశ్వరరావు, జి.విజయరామ్, షేక్‌కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–2 అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ప్రీ మాన్‌సూన్ విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో అంతకాపల్లి ఫీడర్ పరిధి అంతకాపల్లి, రావలమ్మపాలెం, టిక్కలిపాలెం, నాయనమ్మపాలెం, రాయపుర అగ్రహారం, ఆరిపాక, బంగారమ్మపాలెం, అడ్డూరు, గొటివాడ, లగిశెట్టిపాలెం గ్రామాల్లో ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

తీరంలో వీధి కుక్కలతో సందర్శకులు హడల్



తీరంలో సేదదీరుతున్న వీధి కుక్కలు

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరంలో వీధి కుక్కలు హల్‌చల్ చేస్తుండడంతో తీరం అందాలను వీక్షించడానికి వచ్చే సందర్శకులు బెంబెలెత్తిపోతున్నారు. తీరంలో చేపల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తుండడంతో వాటికి అలవాటు పడిన వీధి కుక్కలు ఇక్కడే మకాం వేస్తున్నాయి. పదుల సంఖ్యలో వీధి కుక్కలు తీరంలో సంచరిస్తున్న కారణంగా బీచ్ చూసేందుకు వచ్చే వారు హడలిపోతున్నారు. ఈ కుక్కలు తరచూ సందర్శకులపై దాడులకు పాల్పడుతుండడంతో భయపడుతున్నారు. ముత్యాలమ్మపాలెంతోపాటు తిక్కవానిపాలెం తీరంలో కూడా వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. తీర ప్రాంతాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీటి బెడదను అరికట్టడానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని సందర్శకులు, స్థానికులు కోరుతున్నారు.

దుర్గాలమ్మా.. చల్లగ చూడమ్మా



గ్రామంలో సారె ఊరేస్తున్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ డొంకాడ ప్రజల ఆరాధ్య దైవం దుర్గాలమ్మ ఆలయ 22వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, చీర, సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా గ్రామంలోని రామాలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు మహిళలు పెద్ద సంఖ్యలో సారెను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో అగనంపూడి సెక్టార్–1 నిర్వాసితకాలనీలు, బీసీకాలనీ, సాయినగర్ కాలనీల భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు దాసరి త్రినాథరావు, సన్యాసిరావు, బొబ్బరి అప్పారావు, దాసరి నామయుడు, కరణం శ్రీను, అట్టా అప్పారావు, బళ్ల సత్తిబాబు, కరణం పెంటారావు, సీహెచ్.దుర్గారావు, వై.గణేష్, డి.రవి, ఐ.పెంటారావు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



బాబాను దర్శించుకుంటున్న అదీప్‌రాజ్

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు సప్తగిరినగర్‌లోని షిరిడిసాయిబాబా మందిర ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి బాబాకు విశేష పూజలు జరిపారు. నగర సంకీర్తన చేపట్టారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ జరిగింది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, నాయకులు చిరికి దేముడు, డీఎస్ మూర్తి, రెడ్డి సోమునాయుడు, డి.రాంబాబు, కొరుబిల్లి సతీష్, మహేష్, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.